# ఇండియా-ఆఫ్రికా రెండో శిఖరాగ్ర సదస్సు

## ప్రపంచాభివృద్ధికి నూతన ధ్రువం – ఆఫ్రికా

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అగ్రగామి అయిన భారతదేశం, అదే పంథాలో ముందుకు దూసుకెళ్తున్న ఆఫ్రికా దేశాలతో కలిసి ప్రగతిని సాధించడానికి చొరవ తీసుకోవటం హర్షించదగ్గ విషయం. భారత ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఇటీవల జరిగిన ఇండియా–ఆఫ్రికా రెండో శిఖరాగ్ర సమావేశంలో ఆఫ్రికా ఖండాన్ని 'ప్రపంచాభివృద్ధికి నూతన ధ్రువం'గా అభివర్ణించారు. ఇండియా–ఆఫ్రికా ప్రథమ సమావేశం 2008లో ఢిల్లీలో జరిగింది. మూడేళ్ల తర్వాత రెండో సమావేశాన్ని ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలో ఈ ఏడాది మే 24, 25 తేదీల్లో నిర్వహించారు. ఈ సదస్సుకు ఆఫ్రికన్ యూనియన్ అధ్యక్షుడైన టుయొడొరొ మొబసొగొ, భారత ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ సహాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సమావేశానికి 53 దేశాలతో కూడిన ఆఫ్రికన్ యూనియన్‌లో రాజకీయంగా, ఆర్థికంగా ప్రముఖమైన 15 దేశాలు హాజరయ్యాయి. అవి అల్జీరియా, బురుండీ, చాద్, ఈజిప్టు, ఈక్వెటోరియల్ గినియా, ఇథియోపియా, కెన్యా, లిబియా, మాల్వి, నమీబియా, మారిటానియా, నైజీరియా, సెనెగల్, దక్షిణాఫ్రికా, స్వాజిలాండ్. ఇండియా–ఆఫ్రికా దేశాల భాగస్వామ్యం త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తుంది. అవి నైపుణ్యాన్ని బదిలీ చేసుకోవడం, సామర్థ్యాన్ని పెంపొందించటం, వాణిజ్యాన్ని పెంచుకోవడం.

## సహాభివృద్ధి లేదా ద్విపార్శ్వ ప్రగతి (Codevelopment or two way development):

రెండు బిలియన్లకు పైగా మానవాళిని ప్రభావితం చేసే ఈ శిఖరాగ్ర సమావేశ ప్రయోజనాలను అంచనా వేసే ముందు, ఆఫ్రికా ఖండ ముఖచిత్రాన్ని క్లుప్తంగా తెలుసుకోవటం అవసరం. వైశాల్యంలో, జనాభాలో ప్రపంచంలో రెండో పెద్ద ఖండం ఆఫ్రికా. దాదాపు 30.2 మిలియన్ చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగి ప్రపంచ వైశాల్యంలో 20.4 శాతం భూభాగాన్ని ఆక్రమిస్తుంది. ఒక బిలియన్‌కు పైగానున్న ప్రజాసమూహం ప్రపంచ జనాభాలో 14.72 శాతంగా ఉంది. ఆఫ్రికా సంపన్న ఖండం. ఖనిజాలు, ఇంధనం, ఇతర సహజ వనరులు దీని సొత్తు.ప్రపంచంలో లభ్యమయ్యే ఖనిజాల్లో 90 శాతం కోబాల్ట్, 90 శాతం ప్లాటినం, 50 శాతం బంగారం, 90 శాతం క్రోమియం, 70 శాతం టాంటిలైట్, 64 శాతం మాంగనీసు, మూడింట ఒక వంతు యురేనియం నిక్షేపాలు ఉన్నాయి.

డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో 70 శాతం కోల్టాన్ (మొబైల్ ఫోన్ల తయారీకి వాడే మూలకం), 30 శాతం వజ్రాలు లభ్యమౌతున్నాయి. ప్రపంచంలో బాక్సైట్ ఖనిజాన్ని ఎక్కువగా ఎగుమతి చేసే దేశం గినియా. సూడాన్, లిబియా, నైజీరియా మొదలైన దేశాల్లో క్రూడాయిల్‌ను విస్తారంగా వెలికితీస్తున్నారు. ఈజిప్టులో అపార సహజవాయువు లభిస్తోంది. ప్రపంచంలో సహజవనరుల్లో, మానవ వనరుల్లో 15 శాతం వనరులను కలిగి ఉన్న ఈ సంపన్న ఖండం దురదృష్టవశాత్తూ ప్రపంచంలోనే అతిపెద్ద, వెనుకబడిన దేశాల సముదాయంగా కొనసాగుతుం డడం గమనించాల్సిన అంశం. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం ప్రపంచంలోని 175 దేశాల్లో అట్టడుగున ఉన్న 25 దేశాలు ఆఫ్రికాలోనే ఉన్నాయి. పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి, వివిధ తెగల మధ్య ఘర్షణ, సైనిక ఘర్షణ మొదలైన అంశాలు ఈ దేశాల పాలిట శాపంగా మారాయి. ఈ విషవలయం నుంచి ఆఫ్రికా దేశాలను బయటకు తీసుకురావటానికి తోటి వర్ధమాన దేశమైన ఇండియా చొరవ తీసుకోవటం శుభసూచికం. ఈ ప్రయత్నంలో ఇరుపక్షాలు లబ్ధి పొందుతాయనేది నిర్వివాదాంశం.



ప్రథమ శిఖరాగ్ర సమావేశం (2008) తర్వాత ఇండియా–ఆఫ్రికా దేశాల మధ్య వాణిజ్యం పెరిగింది. గతేడాది భారతదేశం ₹ 20.7 బిలియన్ల డాలర్ల విలువ కలిగిన సరుకులను, సేవలను ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంది. ఎగుమతులు ₹ 10.3 బిలియన్లు. గతేడాది ఇరు పక్షాలు ఆచరణాత్మక ప్రణాళికను రూపొందించాయి. ఇందులో భాగంగా ఆఫ్రికాలో వివిధ దేశాల్లో 21 శిక్షణా కేంద్రాలను నెలకొల్పడానికి నిర్ణయించారు. వజ్రాలకు సానబెట్టడం నుంచి వ్యవసాయ రంగం, ఔత్సాహిక రంగం వరకు శిక్షణనివ్వటం. ఉగాండాలో ఇండియా–ఆఫ్రికా విదేశీ వాణిజ్య కేంద్రం, ఘనాలో ఇండియా–ఆఫ్రికా సమాచార సాంకేతిక కేంద్రం, బోట్స్‌వానాలో వజ్రాల కేంద్రం, బురుండీలో విద్య, ప్రణాళిక, పాలనా కేంద్రం మొదలైనవి ఈ ప్రణాళికలోని ప్రముఖ కార్యక్రమాలు. మానవ వనరుల అభివృద్ధి, సామర్థ్యం పెంపుదల– న్యూఢిల్లీ ప్రాధాన్యతనిచ్చే అంశాలు. కానీ వాగ్దానాల అమల్లో మనం వెనుకంజలో ఉన్నామని ఒప్పుకోవాల్సిందే. పొరుగుదేశమైన చైనా ఆఫ్రికాలో తన ప్రాబల్యాన్ని త్వరితగతిన పెంచుకుంటోంది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో 20 నెలల కిందట ఖరారైన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు ఇప్పటికీ ఇండియా ప్రారంభించలేదు. చైనా అదే తరహా ప్రాజెక్టును మూడు నెలల క్రితం ఆమోదించి పని ప్రారంభించింది. నాలుగేళ్ల కిందట ఉగాండాతో మనదేశం చేసుకొన్న ఒడంబడిక ప్రకారం అణుశక్తి రంగంలో ఇంజనీర్లకు శిక్షణనిచ్చే కార్యక్రమం ఇప్పటికీ ప్రారంభం కాలేదు. అపార యురేనియం నిక్షేపాలు కలిగిన ఉగాండా భారతదేశానికి యురేనియం ఖనిజాన్ని

SAKSHI

ఎగుమతి చేయటానికి సంసిద్ధతను తెలియజేసింది.

## భారత్ చేయాల్సింది:

చైనా మౌలిక సదుపాయాల రంగంలో భారత్ కంటే ఎంతో ముందుంది. పెట్టుబడికి తగిన ఆర్థిక వనరులు చైనాకు పుష్కలంగా ఉన్నాయి. భారీ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి (యూరప్, అమెరికా దేశాల కంటే) ఆఫ్రికా ప్రగతిలో కీలక భాగస్వామిగా రూపొందుతోంది. వాస్తవానికి ఆఫ్రికాలో చైనా కంటే భారతదేశానికి, ఎక్కువ అనుకూల పరిస్థితులు ఉన్నాయి.

భారత సంతతికి చెందిన రెండు మిలియన్ల మంది ప్రజలు ఆఫ్రికాలో ఉన్నారు. ఎక్కువ మంది దక్షిణాఫ్రికా, కెన్యా, టాంజానియా, నైజీరియాలో ఉన్నప్పటికీ, దాదాపు ఆఫ్రికాలోని 54 దేశాల్లో భారతీయ వ్యాపారస్తులు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, డాక్టర్లు, సమాచార నిపుణులు పనిచేస్తున్నారు. వీరిలో కొంత మంది ఆయా దేశాల్లో ప్రభుత్వరంగంలో కీలక పదవులను నిర్వహిస్తున్నారు. రాజకీయంగా కూడా భారతదేశానికి చాలా అనుకూలాంశాలు ఉన్నాయి. జాత్యాహంకార విధానాన్ని, సామ్రాజ్యవాద విధానాన్ని వ్యతిరేకిస్తూ, భారత దేశం 1950 నుంచి అంతర్జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ఆఫ్రికా ప్రజల విమోచనా ఉద్యమానికి మద్దతునిచ్చింది.

సగటు ఆఫ్రికా పౌరునికి, పాలకులకు భారతదేశం పట్ల సకారాత్మక వైఖరి ఉంది. అలీన ఉద్యమానికి మూలస్తంభంలాగా వ్యవహరించిన ఇండియా, ఈజిప్టు, ఘనా, ఇండోనేషియా, శ్రీలంక నాయకులతో కలిసి అంతర్జాతీయ వేదికల్లో ఆఫ్రికా దేశాల తరపున సాగించిన పోరాటం అక్కడి ప్రజల మదిలో ఇప్పటికీ పదిలంగా ఉంది. ఈ సానుకూల వాతావరణాన్ని భారతదేశం సద్వినియోగం చేసుకొని తన బాగుతోపాటు తోటి బడుగుదేశాల బాగుకు కృషి చేయాలి.

## రెండో శిఖరాగ్ర సదస్సులోభారత్ తీసుకున్న చొరవ:

భారత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో భారత్‌కు ఆఫ్రికా ఖండం అత్యంత ప్రాధాన్యమైనదని, దాదాపు 80 సంస్థలను..అక్కడి వివిధ దేశాల్లో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆహార పదార్థాల తయారీ, జౌళి పరిశ్రమ, వాతావరణం అంచనా, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి మొదలైన రంగాల్లో ఖండాంతర స్థాయిలో సహకరం, ప్రాంతీయ స్థాయిలో భూమి, నీరు, కణాల పరిశోధనా కేంద్రాలు, విత్తనాల ఉత్పత్తి కేంద్రాలు, రహదారి అభివృద్ధి పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ద్వైపాక్షిక స్థాయిలో వివిధ దేశాల్లో ఆంగ్ల భాష నేర్పే విద్యా సంస్థల ఏర్పాటు, సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటం, ఔత్సాహిక రంగాన్ని ప్రోత్సహించడం, వృత్తిపరమైన శిక్షణా కేంద్రాలు నెలకొల్పటం, గ్రామీణ సాంకేతిక పార్కుల ఏర్పాటు, ఆహార పరీక్ష ప్రయోగాత్మకశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

## సంయుక్త ప్రకటనలో మనదేశం పేర్కొన్న అంశాలు:

ఆఫ్రికా అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవటానికిగానూ ₹ 5 బిలియన్ల రుణాన్ని అందించటం, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయటానికి ₹ 700 మిలియన్ల గ్రాంటు, ఇథియోపియా-డ్జిబౌటీల మధ్య రైల్వే లైను ఏర్పాటుకు ₹ 300 మిలియన్ల రుణం, ఇండియా-ఆఫ్రికా వర్చువల్ విశ్వవిద్యాలయ ఏర్పాటులో భాగంగా 10,000 మంది ఆఫ్రికన్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఆర్థిక, రాజకీయ, ఆరోగ్య, శాస్త్రీయ-సాంకేతిక, విద్యా రంగాల్లో సమగ్ర సహకారాన్ని అందించడం. సోమాలియా తీరప్రాంతంలో చెలరేగుతున్న సముద్రపు దొంగల (పైరేట్లు) అణిచివేతకు ఆఫ్రికన్ యూనియన్ మిషన్ (సోమాలియా)కు ₹ 2 మిలియన్ల ధనసహాయం వంటివి సమావేశం అనంతరం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో మన దేశం పేర్కొన్న అంశాలు.

## ఆడిస్ అబాబా సందేశం :

ఇండియా-ఆఫ్రికాల సహకారం శాశ్వత ప్రాతిపదికగా కొనసాగాలి. సమానత్వం, పరస్పర గౌరవం, పరస్పర ఉపయోగం, పరస్పర ఆధారం- ముఖ్య సూత్రాలు. ఇండి యా ఒక వైపు ఉదారంగా ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని అందిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణల విషయంలో ఆఫ్రికా మద్దతు కోరుతోంది. ఉత్తర ఆఫ్రికాలో ఇటీవల సంభవించిన పరిణామాల దృష్ట్యా అక్కడి ప్రజలకు భారతదేశం తన సంఘీభావాన్ని ప్రకటించింది. ప్రజాస్వామ్య విధానాల ద్వారా తమ భవిష్యత్తును నిర్ణయించుకొనే హక్కు ప్రజలకు ఉందని భారతదేశం పునరుద్ఘాటించింది. ఐక్యరాజ్యసమితి, ఆఫ్రికన్ యూనియన్‌లు సమష్టిగా శాంతిభద్రతల నిర్వహణకు జరుపుతున్న కృషిని గుర్తించి, సమర్థిస్తోంది. ఆఫ్రికా దేశాల నాయకుల స్పందన కూడా సంతృప్తికరంగా ఉంది. సదస్సు సహ అధ్యక్షుడైన టుయొడొరో మొబసొగొ మాటల్లో 'భారతదేశంతో భాగస్వామ్యానికి ఆఫ్రికా ఎంతగానో విలువనిస్తోంది. ఇది మరిన్ని రంగాలకు విస్తృతం కావాలి'.

## సవాళ్లు:

ఇండియా తీసుకున్న చొరవ ఆఫ్రికా దేశాలను సంతృప్తిపరిచిందన టంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఈ చొరవ ఆచరణాత్మకం కావాలి. కాబట్టి ఇండియా ముందున్న మొదటి సవాలు తనిచ్చిన వాగ్దానాలను అమలు చేయటం, రెండోది ప్రభుత్వాధికారులు, వ్యాపారస్తులు సకాలంలో లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయడం. ప్రైవేటు రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు- టాటా, కిర్లోస్కర్, మిట్టల్, రిలయన్స్ సంస్థలు ఇటీవల కాలంలో భారీగా ఆఫ్రికాలో పెట్టుబడులు పెట్టాయి.

ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల మధ్య సరైన సమన్వయం అవసరం. చైనా, బ్రెజిల్, మలేషియా, టర్కీ, జపాన్, యూరోపియన్ యూనియన్, అమెరికా దేశాలు ఆఫ్రికాలో పాగా వేయడానికి ప్రయత్నిస్తున్న ప్రస్తుత తరుణంలో ఇండియా అప్రమత్తంగా లేకపోతే ఒక సువర్ణావకాశాన్ని కోల్పోయినట్లవుతుంది. ఆ అవకాశం మరెన్నటికీ రాదు. చైనా గత సంవత్సరంలో ₹ 115 బిలియన్ల వ్యాపారం చేస్తే, ఇండియా-ఆఫ్రికాల వాణిజ్యం కేవలం ₹ 46 బిలియన్లకే

పరిమితమైంది.

భారత్ తీసుకుంటున్న చొరవ ఆశించిన ఫలితాలివ్వాలంటే దౌత్య, విద్యా, వృత్తిపరమైన రంగాల్లో నిపుణుల చొరవ, శ్రద్ధ అవసరం. ఆఫ్రికాలో విద్యా సంస్థలు, మేధో సంస్థల కొరత ఉంది. భారతదేశం ఆ లోటును భర్తీ చేయాలి. ఆఫ్రికాలో ఎక్కువ దేశాలు, ఇండియాలా బ్రిటీష్ పాలనకు గురైనవే కనుక ఉమ్మడి చరిత్ర, అంతర్జాతీయ భాష అయిన ఆంగ్ల భాష వాడకం ఇరుపక్షాలకు ఉపయోగపడాలి. 2014వ సంవత్సరంలో జరగబోయే మూడో శిఖరాగ్ర సమావేశం ఏ మేరకు విజయవంతమౌవుతుందనేది... ఆడిస్‌అబాబా సదస్సులో తీసుకున్న నిర్ణయాలు ఎంత చిత్తశుద్ధితో అమలయ్యాయనే దాని మీద ఆధార పడి ఉంటుంది.

### ముఖ్యాంశాలు

- ఇండియా-ఆఫ్రికా ప్రథమ సమావేశం 2008లో ఢిల్లీలో జరిగింది.
- రెండో సమావేశం ఇథియోపియా రాజధాని ఆడిస్ అబాబాలో ఈ ఏడాది మే 24, 25 తేదీల్లో జరిగింది.
- ఈ సమావేశానికి ఆఫ్రికా ఖండంలో 15 దేశాలు హాజరయ్యాయి.
- ఆఫ్రికన్ యూనియన్‌లో మొత్తం 53 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి.
- ఇథియోపియా-డ్జిబౌటీల మధ్య రైల్వేలైను ఏర్పాటు.

SAKSHI